కబ్జా చేస్తుంటే కళ్లు మూసుకున్నారా?

- ఆక్రమణల చెరలో జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ వెనుక ఉన్న పార్కు
- అధికారుల నిర్లక్ష్యంపై వెల్లువెత్తుతున్న విమర్శలు
- మేయర్ విజయలక్ష్మి ఆదేశాలతో కదిలిన టౌన్‌ప్లానింగ్ అధికారులు
- ఆక్రమణలను తొలగించిన సిబ్బంది
- ఇంకెన్ని పార్కులు కబ్జాకు గురయ్యాయనే దానిపై ఆరా

బంజారాహిల్స్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ వెనుక వైపు ఉన్న జీహెచ్ఎంసీ పార్కు స్థలంలోని ఆక్రమణలను టౌన్‌ప్లానింగ్ అధికారులు మంగళవారం పూర్తి స్థాయిలో తొలగించారు. సుమారు 180 గజాల పార్కు స్థలాన్ని దాని పక్కనే ఉండే ఓ గెస్ట్‌హౌస్ నిర్వాహకుడు అభివృద్ధి పేరుతో ఆక్రమించేశాడు. పార్కు ప్రహరీని తొలగించిన అతడు, తొమ్మిది అడుగుల మేర గోడ నిర్మించి తన గెస్ట్ హౌస్ నుంచి రాకపోకలు సాగించేలా గేటు ఏర్పాటు చేసుకున్నాడు. మరోవైపు పార్కు స్థలంలో కూరగాయలు పండిస్తున్నాడు. విషయం తెలుసుకున్న నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఆ ప్రాంతాన్ని సందర్శించి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. వెంటనే ఆక్రమణ చెర నుంచి పార్కును విడిపించాలని టౌన్‌ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. దీంతో సోమవారం రాత్రి అధికారులు కూల్చివేతలకు పూనుకున్నారు. కొంత మేర తొలగించి మిగతా పనులను మంగళవారం పూర్తిచేశారు. జీహెచ్ఎంసీ బోర్డు కనిపించేలా ప్రహరీని కూల్చేశారు.

ఆక్రమణకు గురైన స్థలం ఎంత?

అసలు పార్కు విస్తీర్ణం ఎంత మేర ఉంది, ఇంకా ఎంత మంది ప్లాట్ల యజమానులు ఆక్రమించారనే కోణంలో అధికారులు విచారణ చేస్తున్నారు. జూబ్లీహిల్స్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లేఅవుట్‌ను పరిశీలించగా మరో రెండు ప్లాట్ల యజమానులు సైతం ఆక్రమించినట్టు తేల్చారు. అయితే రెవెన్యూ అధికారులను సైతం సర్వే చేయాలని కోరారు. పోలీస్ స్టేషన్ వెనుక ఉన్న ఓ భవన యజమాని పార్కు స్థలాన్ని సొంత ఉద్యానవనంగా మార్చుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అధికారులు ఏం చేస్తున్నట్లు?

పార్కు ఆక్రమణ విషయంలో నగర మేయర్ కలుగజేసుకోవడంతో ఉన్నతాధికారుల్లో కదలిక మొదలైంది. అయితే టౌన్‌ప్లానింగ్ అధికారుల కళ్లుగప్పి ఆక్రమణ ఎలా సాధ్యమైందనే ప్రశ్న తలెత్తుతోంది. నిర్మాణాలను పరిశీలిస్తుంటే ఆక్రమణ అంచెలంచెలుగా జరిగినట్టు తెలుస్తోంది. రెండు సంవత్సరాల క్రితమే ప్రహరీ నిర్మించినట్లు కనిపిస్తోంది. ఇంత జరుగుతున్నా అధికారులు ఎందుకు పట్టించుకోలేదనే విషయంపై విచారణ జరపాలని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే విజిలెన్స్ విభాగం అధికారులు పార్కు ఆక్రమణపై ఆరా తీస్తున్నారు. కాగా, ఇందులో టౌన్‌ప్లానింగ్ సిబ్బంది హస్తం ఉండి ఉంటుందని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మిగతా ప్రాంతాలపై నజర్

జూబ్లీహిల్స్ హౌసింగ్ సొసైటీ ఏర్పడినప్పుడు జీహెచ్ఎంసీ అనేక చోట్ల పార్కుల కోసం స్థలాలను కేటాయించింది. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రతి రోడ్డులో పార్కు కోసం స్థలం అందుబాటులో ఉంచారు. వీటిలో చాలావరకు అభివృద్ధి చెందాయి. అంతర్గత దారుల్లో ఉన్నవి మాత్రం నిరాదరణకు గురయ్యాయి. లే అవుట్ ప్రకారం ఎన్ని పార్కులు ఉండాలి, ప్రస్తుతం అన్యాక్రాంతం అయినవి ఎన్ని అనే దానిపై లెక్కలు తీయాలని అధికారులు భావిస్తున్నారు. కొన్నిచోట్ల పార్కు స్థలాలను డంపింగ్ యార్డులుగా వాడుతున్నట్లు తెలుస్తోంది. వీటన్నింటిపై నిగ్గుతేల్చి పార్కు స్థలాలను కాపాడాలని అధికారులు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు.



పార్కు స్థలంలో ఆక్రమణలను తొలగిస్తున్న సిబ్బంది



బస్తీ వాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి

కార్పొరేటర్ చొరవతో రోడ్డు నిర్మాణం పూర్తి

బంజారాహిల్స్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): స్థానికుల మధ్య తలెత్తిన వివాదం రోడ్డు నిర్మాణ పనులకు అడ్డంకిగా మారింది. అయితే స్థానిక కార్పొరేటర్ కలుగజేసుకొని ఇరు వర్గాలకు నచ్చజెప్పడంతో రాత్రికి రాత్రే రోడ్డు పనులు పూర్తయ్యాయి. వెంకటేశ్వరనగర్ కాలనీ డివిజన్ రోడ్డు నంబర్ 14లోని భాగ్యనగర్ స్టూడియో ఎదురుగా ఉన్న వీధిలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని స్థానికుల ఫిర్యాదు మేరకు కొత్త పైప్‌లైన్ వేయాలని అధికారులు నిర్ణయించారు. అయితే ఈ పనుల కోసం రోడ్డు తవ్విన మూడు నెలల తరువాత పైప్‌లైన్ నిర్మాణం చేపట్టారు. దీంతో ప్రధాన రహదారిలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తడంతో అవసరం లేకున్నా పైప్‌లైన్ వేస్తున్నారని స్థానికుల్లో కొంత మంది అభ్యంతరాలు వ్యక్తం చేశారు. పైప్‌లైన్ వద్దని కొందరు, కావాలని మరికొందరు వాదనకు దిగారు. ఆరు నెలలుగా ఈ వివాదం ఇలాగే కొనసాగుతుంది. చివరకు సోమవారం రాత్రి కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి రెండు వర్గాలతో మాట్లాడారు. ఎవరికి ఎటువంటి ఇబ్బంది తలెత్తినా తాను పరిష్కరిస్తానని హామీ ఇచ్చి రోడ్డు పనులు పూర్తి చేయించారు.



బ్యానర్లను ప్రదర్శిస్తున్న విద్యార్థులు ట్రాఫిక్ పోలీసులు

రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన

బంజారాహిల్స్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతపై విద్యార్థుల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని జూబ్లీహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ అన్నారు. జాతీయ రహదారి భద్రత మహోత్సవాల్లో భాగంగా ఫిలింనగర్ భారతీయ విద్యా భవన్ పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థులు రోడ్డు భద్రతకు పాటించాల్సిన నిబంధనలతో కూడిన బ్యానర్లు, ప్లకార్డులను రోడ్డుపై ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ.. నగరంలో ట్రాఫిక్ పెరుగుతున్న నేపథ్యంలో వాహనదారులు క్రమశిక్షణతో నడుచుకుని ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు. విద్యార్థులు స్కూల్ నుంచి బయటకు రాగానే రోడ్డు మధ్యలో కాకుండా పక్కన వెళ్లాలని సూచించారు.



పార్కు సమస్యలను తెలుసుకుంటున్న అధికారులు

పార్కులను సుందరీకరిస్తాం

పంజాగుట్ట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): వెంగళరావునగర్ డివిజన్‌లోనే అతిపెద్ద కాలనీ అయిన మధురానగర్ కాలనీలోని సి, డి, ఎఫ్ బ్లాకుల్లో ఉన్న మూడు పార్కులలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కాలనీ సంక్షేమ సమితి అధ్యక్షప్రధాన కార్యదర్శులు ప్రతాప్ రెడ్డి, కోడె సాంబశివరావు కోరారు. మంగళవారం జీహెచ్ఎంసీ అర్బన్ బయో డైవర్సిటీ పార్కుల విభాగం డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్, మేనేజర్ విక్రమ్ ఈ పార్కులను పరిశీలించారు. త్వరలోనే పార్కులలో పచ్చదనం పెంపొందించి సుందరీకరిస్తామని, వాకింగ్ ట్రాక్‌లను మెరుగు పరుస్తామని హామీ ఇచ్చారు.

ఏఐ కోర్సుల్లో ఉచిత శిక్షణకు ఫిబ్రవరి 2న టెస్ట్



టెస్ట్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రమణ భూపతి

అమీర్‌పేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఐటీ, ఐటీయేతర రంగాల ఉద్యోగులు నూతన టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని ప్రముఖ సాఫ్ట్‌వేర్ శిక్షణ సంస్థ క్వాలిటీ థాట్ చైర్మన్ రమణ భూపతి అన్నారు. ప్రత్యేకించి రానున్న రోజుల్లో జనరేషన్ ఏఐ టెక్నాలజీ నేర్చుకున్న వారి ఉద్యోగాలే పదిలంగా ఉంటాయన్నారు. మంగళవారం అమీర్‌పేట్‌లోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నూతనంగా అందుబాటులోకి వచ్చిన జనరేషన్ ఏఐ టెక్నాలజీని ఎక్కువమంది ఐటీ ఉద్యోగులకు, కళాశాలల నుంచి వచ్చిన ఫ్రెషర్స్‌కు అందించే ఉద్దేశంతో ఫిబ్రవరి 2న స్కాలర్‌షిప్ టెస్ట్ నిర్వహిస్తున్నామని, ప్రతిభ కనబరిచిన 100మంది అభ్యర్థులకు ఫీజులో 100శాతం రాయితీ ఇస్తామన్నారు. స్కాలర్ షిప్ టెస్టుకు అభ్యర్థులు క్వాలిటీ థాట్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. హైదరాబాద్‌లోని మాదాపూర్, అమీర్‌పేట్ కేంద్రాల్లో మాత్రమే స్కాలర్‌షిప్ టెస్ట్ ఆఫ్‌లైన్‌లో ఉంటుందని, దేశంలోని ఏ ప్రాంతం వారైనా ఆన్‌లైన్‌లో పరీక్షకు హాజరుకావచ్చన్నారు. ఈ టెస్ట్ రాసేందుకు ఇంజనీరింగ్, ఫార్మసీ, మేనేజ్‌మెంట్ లేదా సంప్రదాయ డిగ్రీ కోర్సులు చదివిన వారు అర్హులన్నారు. అనంతరం జనరేషన్ ఏఐ స్కాలర్‌షిప్ టెస్ట్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ప్రియాంక పాల్గొన్నారు.



అశోక్‌రెడ్డికి డైరీని అందజేస్తున్న టీజీవో, టీఎన్జీవో ప్రతినిధులు

వాటర్‌బోర్డు ఎండీకి టీజీవో, టీఎన్జీవో డైరీల అందజేత

హైదరాబాద్ సిటీ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): వాటర్‌బోర్డు ఎండీ అశోక్‌రెడ్డిని మంగళవారం టీజీఓ, టీఎన్జీఓ శాఖల ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు తమ సంఘాల డైరీలను అందజేశారు. ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టులను చేపట్టి, సమర్థవంతంగా బోర్డును నడిపిస్తున్న ఎండీకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీజీఓ హైదరాబాద్ అధ్యక్షులు ఎంబీ కృష్ణ యాదవ్, సెక్రటరీ మహ్మద్ అబ్దుల్ ఖాదర్, వాటర్ బోర్డు సెక్రటరీ చంద్రజ్యోతి, టీఎన్జీఓ అధ్యక్షులు మహేష్ కుమార్ పాల్గొన్నారు.

సీఎం సహాయనిధితో పేదల ఆరోగ్యానికి భరోసా

- ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

బోరబండ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి పథకం పేదల ఆరోగ్యానికి భరోసా ఇస్తోందని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. రహ్మత్‌నగర్‌లో 14 మంది లబ్ధిదారులకు రూ.5.97 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంగళవారం ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నాగరాజు, అరుణ్, అహ్మద్ పటేల్, వాజీద్, లియాకత్ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులు అందజేసి మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాగంటి

అర్హులందరికీ రేషన్ కార్డులు

అర్హత ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డు అందించేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. ఎస్పీఆర్ హిల్స్ మైదానంలో ఏర్పాటు చేసిన కొత్త రేషన్ కార్డుల అవగాహన శిబిరాన్ని ఆయన పరిశీలించారు. పాత కార్డుల్లో తమ పిల్లల పేర్లను చేర్చుకోవచ్చని, కార్డులు లేనివారికి కొత్తగా ఇస్తామని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై ఏఎస్ఓ జ్యోతి, ఇన్‌స్పెక్టర్ విక్రమ్, బీఆర్ఎస్ నాయకులు విజయ్, జగన్, రాజేష్, తరుణ్, రఘు, స్రవంతి, సుజాత పాల్గొన్నారు.

కవితపై దుష్ప్రచారం చేసేవారిని శిక్షించాలి

- మహిళా కమిషన్‌కు జాగృతి నేతల ఫిర్యాదు

హైదరాబాద్ సిటీ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై సోషల్ మీడియాలో రెండు రోజులుగా దుష్ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని జాగృతి రాష్ట్ర నాయకులు మంగళవారం మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరేళ్ల శారదకు ఫిర్యాదు చేశారు. భారత జాగృతి రాష్ట్ర నాయకురాలు దికొండ కవిత మేరు ఆధ్వర్యంలో పలువురు ప్రతినిధుల బృందం మహిళా కమిషన్ కార్యాలయంలో శారదను కలిశారు. ఎమ్మెల్సీ కవిత ఫొటోను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో ట్రోలింగ్ చేస్తున్నారని, ఆమె గౌరవ ప్రతిష్టలకు భంగం కలిగేలా ఉన్నాయన్నారు. తప్పుడు పోస్టింగ్‌లు పెట్టిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. మహిళలపై సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న అకృత్యాలను అడ్డుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. తమ ఫిర్యాదును పరిశీలించి చర్యలు తీసుకుంటామని చైర్‌పర్సన్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో కట్ట అనూష, మురారి స్మిత, కోటేష్ గౌడ్, విజయ, శైలజ తదితరులు పాల్గొన్నారు.



మహిళా కమిషన్ చైర్‌పర్సన్ శారదకు ఫిర్యాదు చేస్తున్న జాగృతి నేతలు

యూకేలో ఉద్యోగం పేరుతో రూ.3.7 లక్షలు కాజేశారు

హైదరాబాద్ సిటీ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): యూకేలో మంచి ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించిన సైబర్ నేరగాళ్లు నగరానికి చెందిన ప్రైవేట్ ఉద్యోగిని బురిడీ కొట్టించి రూ.3.7 లక్షలు కొల్లగొట్టారు. మోసపోయినట్లు ఆలస్యంగా గుర్తించిన బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకి వెళ్తే.. నగరానికి చెందిన 41 ఏళ్ల ప్రైవేట్ ఉద్యోగి విదేశాల్లో ఉద్యోగం కోసం ఆన్‌లైన్ జాబ్ పోర్టల్‌లో తన రెజ్యూమ్‌ను అప్‌లోడ్ చేశాడు. వారం క్రింత గుర్తుతెలియని వ్యక్తి నుంచి కాల్ వచ్చింది. తాను షైన్ డాట్ కామ్ నుంచి కాల్ చేస్తున్నట్లు పరిచయం చేసుకున్న వ్యక్తి విదేశాల్లో ఉద్యోగం కోసం రెజ్యూమ్ సెలెక్ట్ అయిందని చెప్పాడు. యూకేలో మంచి కంపెనీలో ఉద్యోగానికి ఎంపికయ్యాడని, విదేశాలకు వెళ్లడానికి సిద్ధంగా ఉన్నట్లయితే వెంటనే అప్లికేషన్ ప్రాసెసింగ్ ఫీజు, రిజిస్ట్రేషన్ ఫీజు, జాబ్ సెక్యూరిటీ డిపాజిట్ కింద కొంత డబ్బు చెల్లించాలని సూచించాడు. ఇదంతా నిజమేనని నమ్మిన బాధితుడు మూడు విడతల్లో రూ.3.7లక్షలు చెల్లించాడు. ఆ తర్వాత సైతం ఏదో ఒక ఫీజు కింద డబ్బు చెల్లించాలని చెప్పడం తప్ప.. ఎక్కడా ఉద్యోగం గురించి గానీ, యూకేకు వెళ్లే ప్రాసెస్ గురించి గానీ చెప్పకుండా దాటవేస్తున్నారు. దీనిపై బాధితుడు నిలదీయడంతో నేరగాళ్లు స్పందించడం మానేశారు. మోసపోయానని గుర్తించిన బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని టెక్నికల్ ఎవిడెన్స్ ద్వారా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు డీసీపీ ధార కవిత తెలిపారు.

గంజాయి వినియోగిస్తున్న ఇద్దరి అరెస్ట్

బోరబండ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): గంజాయి తాగుతున్న ఇద్దరు యువకులను మధురానగర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సోమవారం రాత్రి పెట్రోలింగ్ వాహనం తిరుగుతుండగా ఇద్దరు యువకులు పారిపోవడానికి ప్రయత్నించారు. వారిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా వారి వద్ద గంజాయి ఉన్నట్లు అంగీకరించారు. వారి వద్ద ఉన్న 1.5 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. రహమత్‌నగర్‌కు చెందిన గోపి కాగా, మరొకరు జవహర్‌నగర్‌కు చెందిన సాయికుమార్‌గా గుర్తించారు.

బల్కంపేటలో అగ్నిప్రమాదం

అమీర్‌పేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): బల్కంపేట రేణుకానగరలోని గ్యాస్ గోడౌన్ సమీపంలో మంగళవారం రాత్రి అగ్నిప్రమాదం జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు చెత్తను తగులబెట్టగా పెద్దఎత్తున మంటలు ఎగసిపడటంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

యువకుడి అదృశ్యం

బోరబండ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో మతిస్థిమితం లేని యువకుడు అదృశ్యమయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డికి చెందిన ఎం.దత్తు(40) ఎర్రగడ్డ మానసిక వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. సోమవారం బయటకు వెళ్లి ఎంతకీ తిరిగిరాకపోవడంతో బంధువులు బోరబండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఫోన్ ట్యాపింగ్‌పై పోలీసుల విచారణ

తాండూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): శాసనసభ ఎన్నికల ముందు జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ మురళీకృష్ణగౌడ్‌కు సంబంధించిన సెల్‌ఫోన్‌ను ట్రాప్ చేశారనే ఫిర్యాదుపై జూబ్లీహిల్స్ పోలీసులు మంగళవారం విచారణ జరిపారు. అప్పట్లో ప్రభుత్వానికి సంబంధించి కొంతమంది అధికారులు పార్టీ మారిన నేతల ఫోన్లను ట్యాపింగ్ చేశారని పోలీసులకు నివేదిక అందింది. ఈ నివేదిక ఆధారంగా గతంలో తాండూరు సీనియర్ నాయకుడు డాక్టర్ సంపత్ కుమార్‌ను పోలీసులు విచారించారు. మంగళవారం జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ మురళీకృష్ణ గౌడ్‌కు జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కు పిలిపించి రెండు గంటల పాటు విచారించారు. ఫోన్ ట్యాపింగ్ జరుగుతుందనే అనుమానంతో ముందుగానే ఫిర్యాదు ఇచ్చినప్పటికి పట్టించుకోలేదని, ఈ నిజానిజాలు తేలాలని మురళీకృష్ణ గౌడ్ పేర్కొన్నారు.

2వ రోజుకు చేరిన ఆర్టిజన్ల రిలే దీక్షలు

ఖైరతాబాద్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులను జేఎల్ఎం, సబ్ ఇంజనీర్, జూనియర్ అసిస్టెంట్లుగా కన్వర్షన్ చేయాలని కోరుతూ చేస్తున్న రిలే నిరాహార దీక్షలు 2వ రోజుకు చేరాయి. ఖైరతాబాద్ మింట్ కాంపౌండ్‌లో జరుగుతున్న రిలే దీక్షల్లో రెండవ రోజు 22 మంది ఆర్టిజన్లు దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేఏసీ సెంట్రల్ సర్కిల్, సౌత్ సర్కిళ్ల చైర్మన్లు ధన్‌రాజ్, రాములు మాట్లాడుతూ.. 20వేల మంది ఆర్టిజన్లను కన్వర్షన్ చేయాలని ఆందోళన కార్యక్రమాలు చేపట్టినా ప్రభుత్వం స్పందించకపోవడంతో రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నామన్నారు. ఫిబ్రవరి 3 నుంచి కన్వర్షన్ యాత్రలు చేపడతామని, అప్పటికీ ప్రభుత్వం స్పందించకుంటే ఫిబ్రవరి 20న ఛలో విద్యుత్ సౌధ చేపడతామని హెచ్చరించారు.

ఫిబ్రవరిలో విద్యార్థి సంఘాల 50 ఏళ్ల ఉద్యమ ప్రస్థానంపై సదస్సు

పంజాగుట్ట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): విశ్వవిద్యాలయాలు, కళాశాలలు, పాఠశాల్లోని సమస్యలపై పోరాటానికి విద్యార్థులను సంఘటితం చేసేందుకు విప్లవ విద్యార్థి సంఘాలు ఏర్పడ్డాయని వక్తలు అన్నారు. సంఘాలు ఏర్పడి 50 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఫిబ్రవరి 20, 21 తేదీల్లో బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సదస్సు జరగనుంది. ఈ నేపథ్యంలో మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సదస్సు ఆహ్వాన సంఘం అధ్యక్షుడు ప్రొఫెసర్ హరగోపాల్, విప్లవ విద్యార్థి సంఘం నాయకులు డాక్టర్ శ్రీనివాస్, రాజేంద్రబాబు, రచయిత సజయ, సీనియర్ జర్నలిస్ట్ విరహత్ అలీ తదితరులు దీనికి సబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ బాలస్వామి కరణం, చక్రధర్ రావు, మోహన్ రెడ్డి, భాస్కర్‌రావు తదితరులు

రేషన్ షాపుల ద్వారా గుడ్లు పంపిణీ చేయాలి

పంజాగుట్ట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కోడిగుడ్డులోని పౌష్టిక విలువలను దృష్టిలో ఉంచుకొని రేషన్ షాపుల ద్వారా గుడ్లను పంపిణీ చేయాలని నేషనల్ ఎగ్ చికెన్ ప్రమోషన్ కౌన్సిల్ (ఎన్ఈసీపీసీ) ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. మంగళవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గుడ్డులో ఉన్న పోషకాల వివరాలతో రూపొందించిన 2025 క్యాలెండర్‌ను ఎన్ఈసీపీసీ అధ్యక్షుడు డాక్టర్ బాలస్వామి కరణం, తెలంగాణ పౌల్ట్రీ ఫెడరేషన్ అధ్యక్షుడు కె.మోహన్ రెడ్డి, కార్యదర్శి భాస్కర్ రావు తదితరులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జీవనశైలి ద్వారా సంక్రమించే వ్యాధులను అరికట్టడంలో కోడిగుడ్డు కీలకంగా వ్యవహరిస్తుందన్నారు. చిన్నారుల్లో పౌష్టికాహారం లోపాన్ని సరిచేయడంలో గుడ్డు కీలకమన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని పనికి ఆహార పథకంలో పనిచేస్తున్న పేదలకు,రేషన్ కార్డు ద్వారా నెలకు 30 గుడ్లు అందించాలని కోరారు. ఈ సమావేశంలో పౌల్ట్రీ ఫెడరేషన్ కోశాధికారి అభిషేక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆనందనగర్ కమ్యూనిటీహాల్‌లో ప్రదర్శించిన కోదండం

బాలరాముడి కోదండానికి పూజలు

పంజాగుట్ట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): అయోధ్య బాల రాముడి కోసం చల్లా శ్రీనివాస శాస్త్రి కిలో బంగారం, 13 కిలోల వెండితో కోదండం (ధనస్సు, విల్లు, చాపము) చేయించారు. దీన్ని అయోధ్యకు తీసుకెళుతున్న క్రమంలో పలు ప్రాంతాల్లో భక్తుల దర్శనార్థం ప్రదర్శిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం ఈ కోదండాన్ని ఖైరతాబాద్ అనంద్‌నగర్ కమ్యూనిటీ హాలులో ప్రదర్శించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాలకు చెందిన భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. విజ్ఞాన సమితి అధ్యక్షుడు సూరి వెంకటేశ్వర్లు, సుజ్ఞాన్, స్థానికులు ఈ పూజల్లో పాల్గొన్నారు.

భార్య కాపురానికి రావట్లేదని వ్యక్తి ఆత్మహత్యాయత్నం

అమీర్‌పేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): భార్య కాపురానికి రావడంలేదని ఒంటిపై పెట్రోల్ పోసుకుని వ్యక్తి నిప్పంటించుకున్న ఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బాపునగర్‌లో మంగళవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన కొమ్ముల చెన్నయ్య(36) తన భార్య కావ్యతో కలిసి రామాంతాపూర్‌లో ఉంటూ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వీరికి ఒక పాప, బాబు ఉన్నారు. అయితే రెండేళ్ల క్రితం భార్యాభర్తల మధ్య గొడవలు తలెత్తడంతో పిల్లలను తీసుకుని కావ్య పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఒంటరిగా ఉంటున్న చెన్నయ్య మంగళవారం ఉదయం బాపునగర్‌కు బైక్‌పై వచ్చి పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. స్థానికులు మంటలను అదుపుచేసి పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు బాధితుడిని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అనంతరం అతడి తలిదండ్రులకు సమాచారమిచ్చారు. చెన్నయ్య తల్లి జానకమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.



బస్తీవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

రెజిమెంటల్ బజార్‌లోని సమస్యలు పరిష్కరిస్తా

● కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్

రెజిమెంటల్‌బజార్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): నియోకవర్గ పర్యటనలో భాగంగా కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ మంగ మోండా డివిజన్ రెజిమెంటల్ బజార్‌లో పర్యటించారు. స్థానికులు తమ బస్తీలోని డ్రైనేజీ, రోడ్లు, వీధి దీపాల సమస్యలను ఎమ్మెల్యేకు వివరించి పరిష్కరించాలని కోరారు. రైల్వే స్టేషన్‌కు సమీపంలోనే ఉండటం వల్ల అపరిచితులు తమ బస్తీలో ఎక్కు వగా సంచరిస్తున్నారని, దొంగతనాలు జరుగుతున్నాయని వారు శ్రీగణేశ్ దృష్టికి తీసుకొచ్చారు. సంబంధిత అధికారులతో మాట్లాడి బస్తీలోని సమస్యలను పరిష్కరిస్తానని, అలాగే సీసీ కెమెరాలు ఏర్పాటు చేయిస్తానని ఎమ్మెల్యే బస్తీవాసులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీసీ సమ్మయ్య, వాటర్ వర్క్స్ డీజీఎం విద్యాసాగర్, ఏఈ చంద్రశేఖర్, విద్యుత్ ఏఈ శాంతి, కాంగ్రెస్ పార్టీ మల్కాజిగిరి పార్లమెంట్ కోఆర్డినేటర్ బాబూరావు, గ్రేటర్ హైదరాబాద్ కాంగ్రెస్ నగర ఉపాధ్యక్షులు నందికంటి రవి, కాంగ్రెస్ నాయకులు సంతోష్ యాదవ్‌అర్వింద్, రాము, శ్రీనాథ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఫేక్ కాల్స్‌కు స్పందించొద్దు

● సైబర్ క్రైమ్ డీఎస్పీ శ్రీనివాస్

అడ్డగుట్ట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాల సైబర్ క్రైమ్ డీఎస్పీ శ్రీనివాస్ ప్రజలకు సూచించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మీపై కేసు నమోదైందని, డిజిటల్ అరెస్ట్ చేశామని, కొంత డబ్బు చెల్లిస్తే కేసు మాఫీ చేస్తామని కొందరు, అలాగే, బ్యాంక్ బిట్, క్రెడిట్ కార్డు అప్‌డేషన్ పేరిట ఓటీపీ చెప్పమని మరికొందరు ఫేక్ కాల్స్ చేసి ఆన్‌లైన్ వేదిక గా మోసాలకు పాల్పడుతున్నారని, ఇలాంటి కాల్స్‌కు స్పందించవద్దని అన్నారు. వ్యాపార రంగంలో పెట్టుబడి పెట్టి లక్షలు కోట్లు సంపాదించుకోవచ్చంటూ అజ్ఞాత వ్యక్తులు ఫోన్ చేస్తే నమ్మి డబ్బులు చెల్లించవద్దన్నారు. ఎవరైనా సైబర్ నేరానికి గురైతే 1930 నెంబరు, లేదా వాట్సాప్ నం. 8712672222కు సమాచారం ఇవ్వాలని డీసీపీ శ్రీనివాస్ సూచించారు.



వనితకాలనీలో స్థానికులతో కలిసి పర్యటిస్తున్న బోర్డు నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ

డ్రైనేజీ సమస్యకు త్వరితగతిన పరిష్కారం

● 'బోర్డు' నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ

బోయిన్‌పల్లి, జనవరి21(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో నెలకొన్న డ్రైనేజీ సమస్యను త్వరితగతిన పరిష్కరించడానికి కృషి చేస్తానని బోర్డు నామినేటెడ్ సభ్యుడు జె.రామకృష్ణ అన్నారు. డ్రైనేజీ సమస్య శాశ్వత పరిష్కారం కోసం ప్రణాళికలు రూపొందించాలని ఇప్పటికే అధికారులను ఆదేశించామని తెలిపారు. బోర్డు పరిధిలో నెలకొన్న సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు కొంత కాలంగా ఆయన స్థానికులతో కలిసి బస్తీలు, కాలనీల్లో పర్యటిస్తున్నారు. ఇదే క్రమంలో రామకృష్ణ మంగళవారం కంటోన్మెంట్ 6వ వార్డు వనితా కాలనీలో స్థానికులతో కలిసి పర్యటించారు. అనంతరం కాలనీవాసులతో సమావేశమై వారి సమస్యలను తెలుసుకున్నారు. కాలనీలో పలు సమస్యలు ఉన్నప్పటికీ ముఖ్యంగా డ్రైనేజీ సమస్యతో ఇబ్బంది పడుతున్నామని స్థానికులు చెప్పారు. అన్ని సమస్యలను పరిష్కరిస్తామని, డ్రైనేజీ సమస్యకు త్వరలోనే చెక్ పెడుతూ శాశ్వత పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో 6వ వార్డు బీజేపీ అధ్యక్షులు ప్రతీక్ జై, సీనియర్ నాయకులు అజయ్ గౌడ్, రవీంధర్‌రెడ్డి, కరణ్, నరేందర్, కాలనీవాసులు శాంత కుమార్ తదితరులు పాల్గొన్నారు



ఆపాతమధురం - 2 పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ గురవారెడ్డి, ఆర్పీ పట్నాయక్, మృణాళిని తదితరులు

'ఆపాత మధురం-2' ఆవిష్కరణ

రాంగోపాల్‌పేట్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రాజా తెలుగువారికి బినాకా గీత్‌మాల అమీన్ సయాని లాంటి వారని డాక్టర్ గురవారెడ్డి అభిప్రాయపడ్డారు. మంగళవారం బేగంపేటలోని కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రిలోని శ్రీనివాసరెడ్డి ఆడిటోరియంలో పాత్రికేయులు, మ్యూజికాలజిస్ట్, హాసం పత్రిక సంపాదకుడు స్వర్గీయ రాజా రాసిన ఆ పాత మధురం - 2 పుస్తకావిష్కరణ సభ జరిగింది. డాక్టర్ గురవారెడ్డి పుస్తకాన్ని ఆవిష్కరించి తొలి ప్రతిని ప్రముఖ సంగీతాభిమాని, విశ్లేషకుడు జె.మధుసూదన శర్మకు అందజేశారు. అనంతరం గురవారెడ్డి మాట్లాడుతూ.. రాజా నిర్వహించిన వెబ్‌సైట్‌ను పునరుద్ధరించాలని వారి పిల్లలను కోరారు. 1971 వరకు వచ్చిన పాటలను విశ్లేషించే పనిని మధుసూదన శర్మ చేస్తే.. దానిని పుస్తకంగా తీసుకొచ్చే బాధ్యత స్వీకరిస్తానన్నారు. ఆత్మీయ అతిథి సి. మృణాళిని మాట్లాడుతూ.. పాటమీద నిరంతరం పరిశోధన చేసిన రాజా లాంటి వారు బహు అరుదని, ఈ పుస్తకంలో ప్రతి పాటతోపాటు క్యూఆర్ కోడ్ పెట్టడం మంచి ప్రయత్నమన్నారు.

ప్రముఖ సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్ మాట్లాడుతూ.. పాట ఎప్పుడు పుట్టింది అనే వివరాలను 'పాట' అనే కార్యక్రమం ద్వారా అందించాలని అనుకున్నానని, అందుకు రాజా తనకు సంపూర్ణ సహకారం అందిస్తానని హామీ ఇచ్చారని, కానీ దానిని నెరవేర్చకుండానే ఆయన మనల్ని విడిచి వెళ్లిపోయారని వాపోయారు. మధుసూదన శర్మ తదుపరి జనరేషన్‌కు తన వద్ద ఉన్న సమాచారాన్ని అందించాలని కోరారు. రాజా రాసిన 'ఆపాతమధురం - 2' పుస్తకాన్ని తీసుకురావడానికి అమెరికాలో ఉండే ఆయన కుమార్తెలు శ్రేష్ఠ, కీర్తన ఎంతో శ్రమించారని, వారిద్దరినీ డాక్టర్ వరప్రసాద్‌రెడ్డి అభినందించారు. త్వరలోనే మ్యూజికాలజిస్ట్ రాజా వెబ్‌సైట్‌ను తిరిగి ప్రారంభిస్తానని రాజా పెద్ద కుమార్తె శ్రేష్ఠ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రముఖ గీత రచయిత భాస్కరభట్ల రవి కుమార్‌తోపాటు రాజా అభిమానులు పలువురు పాల్గొన్నారు.

కవితపై దుష్ప్రచారం చేసేవారిని శిక్షించాలి

● మహిళా కమిషన్‌కు జాగృతి నేతల ఫిర్యాదు

హైదరాబాద్ సిటీ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై సోషల్ మీడియాలో రెండు రోజులుగా దుష్ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని జాగృతి రాష్ట్ర నాయకులు మంగళవారం మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరేళ్ల శారదకు ఫిర్యాదు చేశారు. భారత జాగృతి రాష్ట్ర నాయకురాలు దికొండ కవిత మేరు ఆధ్వర్యంలో పలువురు ప్రతినిధుల బృందం మహిళా కమిషన్ కార్యాలయంలో శారదను కలిశారు. ఎమ్మెల్సీ కవిత ఫొటోను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో ట్రోలింగ్ చేస్తున్నారని, ఆమె గౌరవ ప్రతిష్ఠలకు భంగం కలిగేలా ఉన్నాయన్నారు. తప్పుడు పోస్టింగ్‌లు పెట్టిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. మహిళలపై సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న అకృత్యాలను అడ్డుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. తమ ఫిర్యాదును పరిశీలించి చర్యలు తీసుకుంటామని చైర్‌పర్సన్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో కట్ట అనూష, మురారి స్మిత, కోటేష్ గౌడ్, విజయ, శైలజ తదితరులు పాల్గొన్నారు



ప్రత్యేక అలంకరణలో ఆలయం



ఆలయంలో లక్ష పుష్పార్చన (ఫైల్)

ఆధ్యాత్మికతకు నిలయం

మెట్టుగూడ ఆలయం

కేరళ సంప్రదాయం ఉట్టిపడేలా నిర్మాణం ● మాలధారులకు సకల సౌకర్యాలు

చిలకలగూడ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప నామస్మరణ.. మాలధారుల శరణు ఘోష.. ప్రత్యేక పూజలు.. అన్నదానంతో మెట్టుగూడలోని అయ్యప్ప ఆలయ పరిసరాలు నిత్యం ఆధ్మాతిక శోభతో కళకళలాడుతుంటాయి. కేరళ సంస్కృతి ఉట్టిపడేలా శబరిమల మాదిరిగా నిర్మించిన ఈ గుడి భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. సమీపంలో ఎక్కడా అయ్యప్ప ఆలయం లేకపోవడంతో సీతాఫల్‌మండి, తార్నాక, మల్కాజిగిరి, బోయిగూడ, ముషీరాబాద్ తదితర ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చి అయ్యప్పమాల ధరించి, నిత్య పూజల్లో పాల్గొని.. ఇక్కడి నుంచే ఇరుముడితో స్వాములు శబరిమలకు తరలి వెళ్తుంటారు. కేరళ క్యాలెండర్ ప్రకారం నవంబర్ 14వ తేదీ నుంచి 40 రోజుల పాటు ఇక్కడ మండల పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. అయ్యప్ప స్వామితో పాటు గణపతి, శ్రీమహావిష్ణువు, సుబ్రహ్మణ్య స్వామి, నాగ దేవత విగ్రహాలను ఇక్కడ ప్రతిష్ఠించారు.

మండల మహోత్సవం..

40 రోజుల పాటు నిర్వహించే మండల పూజ మహోత్సవంలో భాగంగా లక్ష పుష్పార్చన, మహా అన్నదానం, చివరి రోజు అయ్యప్ప స్వామిని ఏనుగుపై మెట్టుగూడ వీధుల్లో అంగరంగ వైభవంగా ఊరేగిస్తారు. అయ్యప్ప మాల ధరించి ఇరుముడితో శబరిమలకు వెళ్లే స్వాములకు అవసరమైనవన్నీ ఇక్కడే అందజేస్తారు. భోజన వసతి లేని స్వాములకు ప్రత్యేకంగా భిక్ష ఏర్పాటు చేస్తారు.

ఆలయ చరిత్ర..

1968వ సంవత్సరంలో మెట్టుగూడ రైల్వే క్వార్టర్స్‌లో అయ్యప్ప స్వామి చిత్రపటం పెట్టి తొలిసారి మండల పూజలను ప్రారంభించారు. 1976లో అయ్యప్ప భక్త సమాజం పేరిట సొసైటీని ఏర్పాటు చేశారు. 1987లో స్థలం సేకరించి కేరళ సంప్రదాయ పద్ధతిలో ఆలయ నిర్మాణం చేపట్టారు. నిత్యపూజలు, భజనలు, అన్నదానాలతో ఈ ఆలయం దినదిన ప్రవర్ధమానమైంది. ఇక్కడ ప్రతి ఆదివారం పేదలకు అన్నదానం చేస్తారు. పతి నెలా మొదటి ఆదివారం సంపూర్ణ నారాయణీయ పారాయణం, మంగళవారం సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక పూజలు, గురువారం సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణం, శుక్రవారం లలితా సహస్ర నామపారాయణం, శనివారం అయ్యప్ప స్వామి భజనలు, అఖండ నామ సంకీర్తన 12 గంటల పాటు నిర్వహిస్తారు. చుట్టు పక్కల నుంచి వందలాదిగా భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజల్లో పాలు పంచుకుంటారు.

మాలధారులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం..

అయ్యప్ప మాలధారులకు భిక్ష ఏర్పాటు చేస్తున్నాం. గుడిలో భజనలు, పూజలు చేసుకోవచ్చు. ఇరుముడితో శబరిమలకు వెళ్లే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. ప్రతి ఆదివారం పేదలకు అన్నదానం చేస్తున్నాం. కేరళ సంస్కృతిని తెలిపే నృత్యాలు ఏర్పాటు చేస్తున్నాం.

- సునీల్, ఆలయ మీడియా ప్రతినిధి



ప్రత్యేక పూజల్లో దీపారాధన (ఫైల్)

ట్రాఫిక్ ఇబ్బందులు..

నిత్యం భక్తులతో కిటకిటలాడే ఈ ఆలయ పరిసరాల్లో తరచూ ట్రాఫిక్ జామ్ అవుతుండటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు చెప్తున్నారు. ఇరుకు రోడ్లు కావడంతో సమస్యలు వస్తున్నాయని, ట్రాఫిక్ పోలీసులను నియమించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని కోరుతున్నారు. నవంబర్, డిసెంబర్ నెలల్లో మాల ధరించిన అయ్యప్ప స్వాములతో ఈ ప్రాంతం కిటకిటలాడుతుండటంతో స్కూల్, ఆఫీసులకు వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని స్థానికులు చెప్తున్నారు.



ఎమ్మెల్సీ కోదండరాంను కలిసిన తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ సభ్యులు

ఉద్యమకారులకు నిధులు కేటాయించాలి

అడ్డగుట్ట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): వచ్చే బడ్జెట్‌లో తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన పోరులో పాల్గొన్న ఉద్యమకారులకు ప్రత్యేక నిధులు కేటాయించాలని ఉద్యమకారుల జేఏసీ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంను కలిసి వినతి పత్రం సమర్పించామని ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ ఎస్.యాదగిరి మంగళవారం తెలిపారు. ఎమ్మెల్సీని కలిసిన వారిలో జేఏసీ ప్రధాన కార్యదర్శి రాం రెడ్డి, కోశాధికారి చంద్రన్న ప్రసాద్, రాష్ట్ర నాయకులు అంజలి, సుజి, లావణ్య, స్వరూపరాణి, మల్లేశం, యాదగిరి, రవీందర్‌రావు, యాదగిరి తదితరులు ఉన్నారు.



అన్నదానం

మారేడుపల్లిలోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో మంగళవారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్, ఆలయ పాలయ మండలి చైర్మన్ రేపాల వెంకటేశ్వర్లు, పాలక మండలి సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

(మారేడుపల్లి - ఆంధ్రజ్యోతి)

'మహాసభలను విజయవంతం చేయాలి'

అడ్డగుట్ట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలో ఈనెల 25 నుంచి 28 వరకు నిర్వహించే సీపీఎం 4వ మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వెంకటేశ్ పిలుపునిచ్చారు. మంగళవారం అడ్డగుట్ట సీపీఎం కార్యాలయంలో జరిగిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేదలు, కార్మికుల సంక్షేమం కోసం నిరంతరం సీపీఎం పోరాడుతుందన్నారు. ఈ కార్యక్రమలో సీపీఎం సికింద్రాబాద్ జోన్ కార్యదర్శి అజయ్ బాబు, జోన్ నాయకులు ఆర్ మల్లేష్, మధు, గోపాల్, ఎల్లయ్య, అంజమ్మ పాల్గొన్నారు.



అడ్డగుట్టలో సీపీఎం మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

పేదల ఉపాధికి నష్టం కలిగిస్తే సహించం

● ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

మారేడుపల్లి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పేదల ఉపాధికి నష్టం కలిగిస్తే సహించబోమని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ హెచ్చరించారు. మంగళవారం వెస్ట్ మారేడుపల్లిలోని ఎమ్మెల్యే కార్యాలయం వద్దకు రాంగోపాల్‌పేట్, బేగంపేట, మోండా మార్కెట్ డివిజన్ల పరిధిలోని ఫుట్‌పాత్ వ్యాపారులు, హాకర్స్ పెద్ద సంఖ్యలో వచ్చి తలసానిని కలిశారు. ఎన్నో సంవత్సరాల నుంచి తాము ఫుట్‌పాత్‌లపై చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నామని, ఇప్పుడు వాటిని ట్రాఫిక్ పోలీసులు తొలగిస్తున్నారని, తాము ఎలా బతకాలని ఆవేదని వ్యక్తం చేశారు. తమ కుటుంబాలు రోడ్డున పడతాయని ఎమ్మెల్యే ఎదుట విలపించారు. ఈ నెల 23వ తేదీన జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్ పోలీసులు, టౌన్ ప్లానింగ్ తదితర శాఖల అధికారులతో కలిసి మినిస్టర్ రోడ్, జవహర్ జనతా, మోండా మార్కెట్ డివిజన్లలో పర్యటించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని వివరించారు. పేదల జీవనాధారంపై దెబ్బ కొడతామంటే మాత్రం ఊరుకునే ప్రసక్తి లేదని, ప్రభుత్వంతో కొట్లాడతామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. సమావేశంలో సీనియర్ నాయకులు మల్లికార్జున్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, ఆకుల హరికృష్ణ, తలసాని స్కైలాబ్ యాదవ్, శ్రీహరి, నాగులు, రాములు, ఆరీఫ్ పలువురు ఫుట్‌పాత్ వ్యాపారులు, హాకర్స్ పాల్గొన్నారు.



చిరు వ్యాపారులనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

ఉద్యోగ విరమణ వయస్సును పెంచొద్దు

● ఎంపీ ఆర్. కృష్ణయ్య

బర్కత్‌పుర, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల రిటైర్‌మెంట్ వయస్సును 63 లేక 65 ఏళ్లకు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలను బేషరతుగా ఉపసంహరించుకోవాలని ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ రాష్ట్ర నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేష్ ఆధ్వర్యంలో బీసీ సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ.. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 61 ఏళ్లకు పెంచి తీరని అన్యాయం చేసిందని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగుల ఓట్లతో అధికారంలోకి వచ్చి పదవీ విరమణ వయస్సును పెంచాలనుకోవడం దుర్మార్గమని, ఇది నిరుద్యోగులను మోసం చేయడమేనని ఆరోపించారు. ఉద్యోగులు అందరూ ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నారని ఆయన తెలిపారు. సమావేశంలో బీసీ సంఘాల నేతలు జిల్లపల్లి అంజి, వేముల రామకృష్ణ, నందగోపాల్, నక్క జయంతిగౌడ్, మోది రాందేవ్, చెరుకుల సుగుణ తదితరులు పాల్గొన్నారు,

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

● యాంటీ నార్కోటిక్ బ్యూరో డీఎస్పీ శివన్ నాయుడు

తిరుమలగిరి జనవరి21(ఆంధ్రజ్యోతి): తిరుమలగిరిలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాలపై తెలంగాణ మాదకద్రవ్యాల నిరోధక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో డీఎస్పీ శివన్ నాయుడు, శంకర్ యాదవ్‌లు హాజరై విద్యార్థులకు మాదకద్రవ్యాలను వినియోగించడం వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. ఇటీవల కాలంలో పాఠశాల, కళాశాల విద్యార్థులు మాదకద్రవ్యాలకు బానిసలుగా మారుతున్నారని, ఈ నేపథ్యంలో వారి లో అవగాహన కల్పించాలన్న సంకల్పంతోనే ఈ కార్యక్రమానికి శ్రీకా రం చుట్టామని వారు తెలిపారు. మాదకద్రవ్యాలు మనిషిలోని పరివర్తనను పూర్తిగా నశింపజేసి ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయన్నారు. తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నిర్మూలన కోసం కృషి చేస్తున్నామని, ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులతో కలిసి మాదకద్రవ్యాలు వినియోగించవద్దనే పోస్టర్లను పాఠశాలల్లో అతికించారు. క్లినికల్ సైకాలజిస్ట్ శ్రీ పూజ మాట్లాడుతూ, విద్యార్థులు మాదకద్రవ్యాలకు అలవాటు పడితే ఆరోగ్యం దెబ్బ తినడమే కాకుండా అనేక అనర్థాలు చోటు చేసుకుంటాయన్నారు. మాదకద్రవ్యాల విషయంలో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, సమాజంలో జరుగుతున్న చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని అన్నారు.



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న డీఎస్పీ



ట్రాఫిక్ సిగ్నల్స్ గురించి విద్యార్థులకు వివరిస్తున్న ఇన్‌స్పెక్టర్ మధుబాబు

రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన

తిరుమలగిరి జనవరి 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం తిరుమలగిరి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మధుబాబు సిబ్బందితో కలిసి తిరుమలగిరిలోని గౌతమ్ మోడల్ స్కూల్‌లో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు రోడ్డు దాటే సమయంలో, వాహన నడిపే సమయంలోను తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ట్రాఫిక్ సిగ్నల్స్ ట్రాఫిక్ గుర్తుల గురించి వివరించారు. ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద విద్యార్థులు గుర్తులను తెలుసుకొని నెమ్మదిగా వెళ్లాలని సూచించారు. ఎస్సై శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.



రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం రెజిమెంటల్ బజార్‌లోని సేఠ్ భన్వరిలాల్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించి, ప్రతిజ్ఞ చేయిస్తున్న గోపాలపురం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రాములు , సిబ్బంది. (రెజిమెంటల్‌బజార్,ఆంధ్రజ్యోతి)

రైల్వే స్టేషన్‌లో గుర్తుతెలియని వృద్ధుడి మృతి

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందని ఘటన సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో మంగళవారం జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ పండరి కథనం ప్రకారం.. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లోని ప్లాట్ ఫాం నంబరు 7లో 70 ఏళ్ల వృద్ధుడు చనిపోయి ఉన్నాడని సమాచారం అందడంతో రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని గాంధీ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుడి ఆచూకీ తెలిస్తే 8712658581 నంబరుకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం



సదస్సును ప్రారంభిస్తున్న జేఎన్‌టీయూ ఇన్‌చార్జి వీసీ బాలకిష్టారెడ్డి

ఫార్మా రంగానికి ఉజ్వల భవిష్యత్తు

● జేఎన్‌టీయూ ఇన్‌చార్జి వీసీ బాలకిష్టారెడ్డి

హైదరాబాద్ సిటీ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఫార్మాస్యూటికల్ రంగానికి ఉజ్వల భవిష్యత్తును అందించడంలో యంగ్ ప్రొఫెషనల్స్ కీలకపాత్ర పోషిస్తున్నారని, త్వరలోనే ఇండియన్ ఫార్మా మార్కెట్ 130 బిలియన్ డాలర్లకు చేరువ కానుందని జేఎన్‌టీయూ ఇన్‌చార్జి వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ బాలకిష్టారెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. 'ఇన్నోవేషన్స్ ఇన్ ఫార్మా- హౌ యంగ్‌లీడర్స్ కెన్ డ్రైవ్ చేంజ్' అంశంపై జేఎన్‌టీయూ ఆడిటోరియంలో మంగళవారం ఏర్పాటు చేసిన జాతీయ సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆవిష్కరణ, నాయకత్వం, సహకారం వంటి అంశాలలో నిపుణులతో మార్గదర్శకత్వం పొందడానికి ఈ సదస్సు వేదికగా నిలిచిందన్నారు. వినూత్న ఆలోచనలు, నాయకత్వ లక్షణాలు కలిగిన యువత భవిష్యత్తులో సరికొత్త అవకాశాలను కనుగొనాలని పిలుపునిచ్చారు. జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో అవగాహన ఒప్పందా(ఎంఓయూ)లను కుదుర్చుకోవడం ద్వారా విద్యార్థులకు ఆయా పరిశ్రమలలో తమ ప్రతిభను ప్రదర్శించే అవకాశాలు లభిస్తాయన్నారు. ప్రపంచానికి అవసరమైన సరికొత్త ఆవిష్కరణలు అందించడంలో పరిశ్రమలతో కలిసి విద్యాసంస్థలు కీలక పాత్ర పోషించాలన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ విజయకుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, ఫార్మాస్యూటికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మాజీ అధ్యక్షుడు సురేశ్, అమెరికాకు చెందిన ఆల్బనీ ఫార్మసీ కళాశాల చైర్మన్ టోయిన్ టోఫాడీ, క్రొయేషియాలోని ఫార్మసీ కౌన్సిల్ అధ్యక్షుడు మేస్ట్రోనిక్ అరిజానా తదితరులు పాల్గొన్నారు.